విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com కర్నూలు, శుక్రవారం 21, నవంబరు 2025

పక్కా ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి ..

విశాలాంధ్ర-గుమ్మగట్ట: సొంత ఇల్లు లేని పేదలు ఈనెల 30వ తేదీలోగా గ్రామ సచివాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. 2029 నాటికి ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేరుస్తామని స్పష్టం చేశారు. రాయదుర్గం ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం ఆయన రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 2029 నాటికి ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని వెల్లడించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 7518 మంది ఇంటి కోసం దరఖాస్తులు చేసుకున్నారని అందులో ఇంటి స్థలాలు కలిగిన వారు 4799 మంది కాగా, ఇంకా పట్టాలు రానివారు 2749 మంది ఉన్నారన్నారు. ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాల్సిన వారందరితో కలిపి దాదాపు 3వేల మందికి వచ్చే నెల డిసెంబర్‌లో పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత గడువు పెంపు ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని వెల్లడించారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌టియు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కెజిబివి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.రమణారెడ్డి డిమాండు చేశారు. గురువారం పుట్లూరు మండలములో ఎస్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెజిబివిలో పనిచేస్తున్న వారికి ఎమ్‌టిఎస్ వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అంతేకాకుండా కెజిబివిలలో బైపిసి గ్రూపు ఉన్న చోట ఇంటర్ వారికి తెలుగు, ఇంగ్లీష్ బోధనకు సిఆర్‌టిలను బోధనకు ఉపయోగించడం సరైంది కాదన్నారు.వాస్తవంగా పి జి టి పోస్టు శాంక్షన్ చేసి పిజిటిలచే విద్యార్థులకు బోధన అందించాలన్నారు. అలాగే సి ఎల్ లు,ఒ హెచ్ లు కె జి బివిలలో పని చేస్తున్న వారికి ఎటువంటి అభ్యంతరాలు లేకుండా శాంక్షన్ చేయాలి. పిఆర్‌సి, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని లేనిపక్షంలో గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో చేపట్టిన ఆందోళన ఈ ప్రభుత్వం చవ్వి చూడాల్సి వస్తుందని రమణారెడ్డి హెచ్చరించారు. అదేవిధంగా గత సంవత్సరం పదవ తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు మూడు సబ్జెక్టుల వారికి ఇంతవరకు రెమ్యునరేషన్ జమ చేయలేదు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివచంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి తిరుపాల్ నాయుడు, గండికోట నారాయణ స్వామి, మండల అధ్యయక్షుడు ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలి

నేత కార్మిక సంఘం మండల కార్యదర్శి మధు

విశాలాంధ్ర-శింగనమల : శింగనమల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాహసిల్దార్ శేషారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హాజరయ్యారు. కార్యక్రమానికి మండలాధికారులందరూ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రావణి శ్రీకి సిపిఐ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్ చేనేత మండల కార్యదర్శి నేసే మధుల ఆధ్వర్యంలో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మిక కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని, నేతన్న నేస్తం కింద 25 వేల రూపాయలు చేనేత కార్మికుల బ్యాంక్ ఖాతాకి వెంటనే జమ చేయాలని ఆదరణ 03 పథకం ద్వారా ప్రతి చేనేత లబ్ధిదారుల కి పని ముట్లు అందించి ఆదుకోవాలని, చేనేత కుటుంబాలకు బ్యాంకుల్లో 90 శాతం సబ్సిడీ రుణాలు అందించాలని,చేనేత కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, చేనేత కుటుంబాలు మగ్గాల్లో పూర్తి కాలం పనిచేసిన కూటికి కరువైందని, తక్షణమే చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత నాయకులు రాధాకృష్ణ, శివశంకర్, రామాంజినేయులు, మధు రెడ్డి, రవి రెడ్డి, హరి, చంద్ర, నర్సయ్య, దస్తగిరి, రామాంజినేయులు పాల్గొన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా వచ్చిన వారితో ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. మండలంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ అందుబాటులో లేదని, ప్రజలు తెలిపిన ఫిర్యాదు మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను మందలించారు.

వీధి దీపాలు వెలగక అంధకారం

విశాలాంధ్ర-నార్పల : మండల కేంద్రంలోని బాల నాగికాలనీలో దీపాలు వెలుగక అంధకారంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడు నెలల నుంచి వీధి దీపాలు వెలగక విష సర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలానాగి కాలనీ ఐదు విద్యుత్ స్తంభాలు ఉండగా ఒక విద్యుత్ స్తంభానికి మాత్రమే దీపాలు వెలుగుతున్నాయి. షాదిఖాన్ మజీద్ ఉండడంతో ఎప్పుడూ ఆ ప్రాంతం రద్దీగా ఉంటుంది. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంవీడి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రైవేట్ వైద్య కళాశాలలతో నష్టం

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రయివేటు వైద్య కళాశాలలతో నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు తీరని నష్టం జరుగుతుందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తున్నందుకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో ఉరవకొండ బాలాజీ టాకీస్ వద్ద కోటి సంతకాల సేకరణ చేపట్టారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రయివేటీకరణ చేయాలని చూడటం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య, వైద్య సేవలు దూరమవుతాయని చెప్పారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, వీరన్న, వైఎస్‌ఆర్సిపి పార్టీ నాయకులు ఓబన్న, గోవిందు ఆసిఫ్, ఆంజనేయులు, ఆరే రాజశేఖర్, పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-శెట్టూరు : విద్యార్థులు యువత పుస్తకాలు చదవడం నేర్చుకోవాలని గ్రంథాలయ అధికారి రజిని సూచించారు. గురువారం మండల కేంద్రంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల స్థానిక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథి సర్పంచ్ కుమార్ మాట్లాడుతూ యువతకు గ్రంథాలయాలు మానవ వికాసానికి దోహద పడతాయని తెలిపారు. పుస్తకాలు చదవడం అలవర్చుకుంటే భవిష్యత్తుకు ఆలవాలం అవుతాయని చెప్పారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు సునీత, రాజన్న, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

గుమ్మగట్టలో నేడు ప్రజాదర్బార్

విశాలాంధ్ర-గుమ్మగట్ట : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు "ప్రజాదర్బార్" కార్యక్రమం రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరగనుంది. మండల పరిధిలో ఇప్పటికీ పరిష్కారం దొరకని ప్రజా సమస్యలను పౌరులు అర్జీరూపంలో సమర్పించుకోవచ్చని అధికారులు తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే తనిఖీ

విశాలాంధ్ర-పెద్దవడుగూరు: చుక్కలూరు ఆసుపత్రి వైద్యులు లావణ్య ఆధ్వర్యంలో గురువారం తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు గురువారం చుక్కలూరు 1వ సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే తనిఖీ నిర్వహించారు. శ్రీనివాసులు ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.. అనంతరం సచివాలయం ఏఎన్ఎం విజయలక్ష్మి, ఎం పి హెచ్ ఏనారాయణ స్వామి డైరీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మమ్మ, , ఎంపిహెచ్ఏ ఫిమేల్ విజయలక్ష్మి, ఎంపిహెచ్ఏ మేల్ నారాయణస్వామి, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాలించాలి

కలెక్టర్ ఓ.ఆనంద్

విశాలాంధ్ర-అనంతపురం టౌన్: బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఖచ్చితమైన నిబంధనలు పాటించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కాలుష్య నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్కులు, దయాగ్నస్టిక్ సెంటర్లు బయోమెడి కల్ వ్యర్థాల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. రోగులు, సిబ్బంది ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఆసుపత్రులలో కాలం చెల్లిన మందులను సక్రమంగా ధ్వంసం చేయాల న్నారు.. అటువంటి మందులను సాధారణ చెత్తతో కలిపి పారబోసినట్లయితే పర్యావరణానికి, ప్రజారోగ్యా నికి తీవ్రమైన ముప్పు కలుగుతుందన్నారు. సమావేశం లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.బి.విష్ణు మూర్తి, ప్రజారోగ్య శాఖ ఈఈ బి.ఆదినారాయణ, డీసీఎచ్ఎస్ డాక్టర్ జి.డేవిడ్ సిల్వన్ రాజు, ఐఎంఏ డాక్టర్ మురళి కృష్ణ, ఏపీఎన్ఏ డాక్టర్ విజయ్‌కుమార్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.ఎల్. సుబ్రహ్మణ్యం, మున్సిపల్ సిబిఎంవిటీఎఫ్ అశోక్, పాల్గొన్నారు.

ప్రతి ఇంటా చెత్త సేకరణ కచ్చితంగా చేయాలి..

-జడ్పీ సీఈఓ శివశంకర్

విశాలాంధ్ర-రాప్తాడు: గ్రామాల్లో ప్రతిరోజు ప్రతిఇంటా చెత్త సేకరణ ఖచ్చితంగా జరగాలని జెడ్పి సీఈఓ శివశంకర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని పుల్లలరేవు గ్రామ పంచాయతీ లో బుధవారం ఇంటి ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా డస్ట్ బిన్నులు ఉపయోగించి పంచాయతీ కార్మికులు వచ్చినప్పుడు వారికి ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరించేటప్పుడు ప్రజలతో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. అదేవిధంగా సర్పంచు, పంచాయతీ కార్యదర్శి సమన్వయంతో చెత్తతో సంపదను సృష్టించేలా వర్మీ కంపోస్టు ఎరువును తయారుచేసి విక్రయించాలన్నారు. దీనిద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ అచ్యుతానందబాబు, పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత : డా.విశాల ఫెర్రర్

విశాలాంధ్ర-రాప్తాడు: సమాజంలో బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని ఆర్డిటి మహిళా సాధికారత డైరెక్టర్ డాక్టర్ విశాలా ఫెర్రర్ అన్నారు. బుధవారం రాప్తాడు మండలం పంగల్ రోడ్డు సమీపంలోని ఆర్.డి.టి సమ్మిళిత ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి అనంతపురము జిల్లాను బాలల స్నేహ జిల్లాగా చేయుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణ కుమారి, విభిన్న ప్రతిభావంతుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన, ఆర్.డి.టి డైరెక్టర్స్ మహమ్మద్ రఫీక్, శోభారాణి హాజరయ్యారు. డాక్టర్ విశాల ఫెర్రర్ మాట్లాడుతూ బాలలు మన జాతీయ సంపద అని, బాలలు తమ హక్కులను, భాధ్యతలను తెలుసుకొని ప్రతి ఒక్కరు అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. సమాజంలో ఎదురైయ్యే సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ బాలల దినోత్సవ థీమ్ అయిన ఎవరి చైల్డ్ ఎవరి రైట్, మై డే మై రైట్స్‌ను ప్రస్తావిస్తూ పిల్లలు సురక్షితంగా, రక్షితంగా, గౌరవంతో పెరిగే వాతావరణం కల్పించాలన్నారు. ఆర్‌డిటి సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాలలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు ఏర్పాటు చేసి, పిల్లల రక్షణకు ప్రతి గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనకు శ్రద్ధ చూపడం అభినందనీయం అని ప్రశంసించారు ఆటల పోటీల చిన్నారి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఆర్.డి.టి కోఆర్డినేటర్స్ ఆదినారాయణ, హనుమంతు, కౌన్సిలర్ చరిత ఫెర్రర్, ప్రిన్సిపాల్ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

నా భర్తను కిడ్నాప్ చేశారు.. న్యాయం చేయండి

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: తన భర్త శ్రీరాములను కిడ్నాప్ చేశారని, ఎస్పీ న్యాయం చేయాలంటూ కోవూర్ నగర్‌కు చెందిన పుష్ప శ్రీరాములు అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఏపీ ఎన్జీవో భవనంలో గురువారం విలేకరులతో వివరాలు వెల్లడించారు. అనంతపురం లోని కొవూర్ నగర్‌కు చెందిన పుష్ప శ్రీరాములు గత కొన్ని ఏళ్లుగా బెంగళూరులో స్థిరపడ్డారు. కల్పవృక్ష డెవలప్మెంట్ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేసి, వివిధ ప్రాజెక్టుల ద్వారా వచ్చిన లాభాలలో తమ సంస్థలో పెట్టుబడులు పెట్టిన వారికి వచ్చిన లాభాల్లో సగం వాటా.. ఇస్తూ వచ్చామన్నారు. ఇలా తిరుమలేష్, ప్రియాంక, శారద, ఉమా, మరికొంత మందితో కలిసి తమకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వలేదంటూ.. తప్పుడు ఆరోపణలు చేశారని వాపోయారు. తాము వారికి చెల్లించిన డబ్బును రికార్డులతో సహా తమతో ఉన్నాయన్నారు. వారికి చెల్లించిన ప్రతి రూపాయి బ్యాంక్ ద్వారానే చెల్లించామని తెలియజేశారు. కేవలం రూ.15లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. కోట్ల రుపాయలు ఇవ్వాలంటూ నిత్యం ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనిపై కర్ణాటకలోనూ కేసులు నమోదు చేశారని, వారికి ఇవ్వాల్సిన డబ్బు ఇస్తామన్న తన భర్త శ్రీరాములను బ్లాక్మెయిల్ చేశారన్నారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని కోవూరు నగర్‌లో ఉన్న ఇంటికి కొంతమంది వచ్చి తన భర్త శ్రీరాములను కిడ్నాప్ చేసి బలవంతంగా తీసుకెళ్లారన్నారు. ఇప్పటివరకు తన భర్త ఆచూకీ తెలియటం లేదని, దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు. ఎస్పీ మాకు న్యాయం చేయాలని కోరారు. అలాగే తమపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం కింద కేసు నమోదు చేస్తానని ఆమె హెచ్చరించారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం : ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

విశాలాంధ్ర-తాడిపత్రి: నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు, తాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి రైతులకు, ప్రజలకు భరోసా ఇచ్చారు. గురువారం పెద్ద పప్పూరు మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో ఉన్న ముచ్చుకోట రిజర్వాయర్ను, తాడిపత్రి కాల్వకు వెళ్లే సాగునీటి సెటరను ఎమ్మెల్యే పరిశీలించారు. మొదటగా ముచ్చుకోట రిజర్వాయర్లోకి పిఏబిఆర్ నుంచి వస్తున్న నీటి ప్రవాహం గురించి అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా తాను రైతులకు ఇచ్చిన హామీ మేరకు ముచ్చుకోట రిజర్వాయర్ తోపాటు, నియోజకవర్గంలో ఉన్న డ్యాములకు, చెరువులకు, సాగునీటి కాలువలకు, త్రాగునీటి, సాగునీటి అవసరాలకు నీరు అందిస్తామని రైతులకు భరోసా కల్పించారు.

ఎమ్మెల్యే కాల్వ చొరవతో కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని సింగేపల్లి నుండి క0దేపల్లికి వెళ్లి రహదారి గత మూడు నెలల క్రితం భారీ వర్షాలకు కోతకు గురవడంతో రాకపోకలకు నిలిచిపోయి ప్రయాణికులు వాహనదారులు చాలా ఇబ్బందులు పడే వారు. విషయాన్ని సింగేపల్లి టిడిపి నాయకులు బొంబాయి ఈరన్న, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో అధికారులు రోడ్డు మరమత్తులు చేసి యథావిధిగా రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు. కాల్వ శ్రీనివాసులు కూటిమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొంబాయి ఈరన్న, గోపాల్, నాగరాజు, ఆలయ ధర్మకర్త బసవరాజు, డీలర్ వన్నూరు స్వామి, సీనప్ప, కందేపల్లి ఎర్రి స్వామి, మాజీ ఎంపీటీసీ వేమన్న, ఎస్ జివన్నూరు స్వామి, సుంకన్న, చెవులు వన్నూరు స్వామి, బంగీ లోకేష్, సొంటి వన్నూరు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ అసెంబ్లీకి యాడికి జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అనిల్‌కుమార్ మోడల్ అసెంబ్లీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు సీతా రామాంజనేయులు గురువారం తెలిపారు. అమరావతిలో ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు విద్యార్థులను మోడల్ అసెంబ్లీకి ఎంపిక చేశారు. వారిలో అనిల్‌కుమార్ ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర-గుంతకల్లు : విద్యార్థులు ప్రతి పోటీలోనూ గెలవాలని ప్రభుత్వాసుపత్రి డాక్టర్ గైనకాలజిస్ట్ సుజాత అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయలో ముగింపు జాతీయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ సుజాత మాట్లాడుతూ పోటీలోనే కాదు గేమ్స్, ఎస్సే రైటింగ్‌లు, క్రికెట్, ఫుట్‌బాల్, ప్రతి ఒక్క దానిలో విద్యార్థులు, విద్యార్థినులు ముందుండాలని పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారినీ కే.సుజాత అధ్యక్షతన జరిగింది. అనంతరం డాక్టర్ సుజాత ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి, గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులాపురం మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపన వెలసిన మహాలక్ష్మి అమ్మవారికి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు వచ్చి అమ్మవారికి పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. పూజా కార్యక్రమాన్ని రఘు స్వామి నిర్వహించారు.

ఎమ్మెల్యే ఆదేశం.. నాయకుల ఆచరణ

బోయిరెడ్డిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని బోయిరెడ్డిపల్లి గ్రామం లో తాగునీటి సమస్య ఉండడంతో గ్రామ సభలో గ్రామస్తులు తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం ఆయన ఆదేశాల మేరకు టిడిపి నాయకుడు బోయరెడ్డిపల్లి హరి గ్రామంలో పైపులైను పనులు చేపించి తాగునీటి సమస్యను తీర్చారు. అనంతరం బోయరెడ్డిపల్లి హరి, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు .

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు బెలుగుప్ప ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-బెలుకుప్ప: స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-14 సాఫ్బాల్ ఉమ్మడి అనంతపురం జిల్లా సెలక్షన్స్ ఈనెల 19వ తేదీ బుధవారం అనంత స్పోర్ట్స్ విలేజ్, ఆర్డిటి అనంతపురంలో జరిగాయి. ఈ ఎంపికలలో బెలుగుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన హరి సాద్విక్ 8వ తరగతి అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నితను ఈనెల 22 నుండి 24 వరకు పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాడు. అదేవిధంగా అండర్- 17 బేస్బాల్ ఉమ్మడి జిల్లా సెలక్షన్లు ఈనెల 16వ తేదీ ఆదివారం అనంత క్రీడా గ్రామం ఆర్డిటి అనంతపురం జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెలుగుప్పకు చెందిన రాజశేఖర్ 8వ తరగతి విద్యార్థి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి అండర్-17 బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ రాష్ట్రస్థాయి బేస్బాల్ పోటీలు ఈనెల నవంబర్ 26 నుండి 28 వరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గుత్తి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి శ్రీ మల్లారెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలు కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో హరికృష్ణ 2, ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్, గోపాల్‌రెడ్డి పిడి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీ రుద్రన్న, గోవింద్‌రెడ్డి ఉపాధ్యాయ బృందం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

పుస్తక పఠనం ప్రాముఖ్యతపై అవగాహన

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. సరస్వతీ విద్యా మందిరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమలరావు, చల్లా కిషోర్, లింగప్రసాద్, రాజన్న, గోపీనాథ్, రాయల్ వెంకటేష్, జె.వెంకటేషులు, ఓబుల్ రెడ్డి, రామచంద్ర నాయక్, ఉజ్వల హెూం నిర్వాహకురాలు శ్యామల హాజరయ్యారు. అతిథులు పుస్తక పఠనం ప్రాముఖ్యత, గ్రంథాలయాల పాత్ర, పిల్లల్లో పఠనాభిరుచి పెంపు, భాషా నైపుణ్యం, మేధస్సు అభివృద్ధి, సోషల్ మీడియా వినియోగంపై విద్యార్థులకు సూచనలు అందించారు. వ్యాసరచన, ఇంగ్లీష్ క్విజ్, జీకే, మ్యూజికల్ చైర్ మొదలైన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సరస్వతి విద్యా మందిరం 30, నార్త్ స్కూల్ 9, ఎంపీపీ కోటా వీధి 6, పీహెచ్ స్కూల్ నారాయణపురం 9 బహుమతు లను సాధించాయి. మొత్తం 78 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ సిబ్బంది ఉమామహేశ్వరి,సౌందర్య, రఘు, బాలచంద్ర, వసంత్, రేష్మ, యమునా, గంగమ్మ, విక్రమ్ హాజరయ్యారు.

పాల్తూరు వంక గుంతలకు గ్రావెల్ పనులు

విశాలాంధ్ర-విడపనకల్లు : పాల్తూరు గ్రామ సమీపంలో పెద్ద వంక దగ్గర రోడ్డు గుంతలు పడడం వలన గత 8 రోజుల నుంచి ఉరవకొండ నుంచి పాల్తూరు మీదుగా దర్గా హెూనూర్ వరకు బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు మరియు విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అందరూ సర్పంచ్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సకాలంలో స్పందించిన పాల్తూరు సర్పంచ్ బ్యాలా రాణి ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ మరియు జిల్లా టిడిపి సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు దృష్టికి తీసుకొని పోయి ఆర్ అండ్ బి జెఈతో మాట్లాడి గుంతలకు గ్రావెల్ వేయడంతో రేపటి నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలని ఉరవకొండ ఆర్టీసీ డిఎం తో పాల్తూరు సర్పంచ్ బ్యాలా రాణి మాట్లాడడంతో వారు సానుకూలంగా స్పందించి యథావిధిగా బస్సులు నడుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, కాలేజీ స్టూడెంట్స్ పాల్గొనడం జరిగినది.

అగాపే ఆశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో గురువారం మాదన శంకరయ్య, భార్య భూలక్ష్మి వీరి పెద్ద కుమారుడు ఆంజనేయులు, కోడలు అపర్ణ, చిన్న కుమారుడు రుద్రయ్య, కుమార్తె ధరణి,అల్లుడు విశ్వనాథ్,మనవరాలు కుందన, మనవడు సంతోష్ వీరి కుటుంబము ఆశ్రమంలోని నిరాశ్రయులకు కార్తీక మాసం పురస్కరించుకొని న్నదానం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, ఆశ్రమవాసులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఆలయ నిర్మాణ భూమి పూజకు ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆహ్వానం

విశాలాంధ్ర-ఎల్లనూరు : మండలంలోని బొప్పేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కోన ఓబులేసు స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఈనెల 27న భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో ఆలయ కమిటీ సభ్యులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిని ఆహ్వానించారు. అలాగే సింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ఏడీసీసీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడులను ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించినట్లు చెప్పారు.

టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం సందర్శన

విశాలాంధ్ర-కూడేరు: మండలంలోని కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ అబ్జర్వర్ లకి జరుగుతున్న రెండు రోజుల టీచ్ టూల్ రిఫ్రెషర్ ట్రైనింగ్ సెంటరును కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్(సీఎంఓ) చంద్రశేఖర్, అసిస్టెంట్ ఏఎంఓ నారాయణస్వామి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం సందర్శించారు. వారు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధనను పరిశీలన చేసి విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని టీచ్ టూల్ అబ్జర్వర్లకు తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాధికారి మహమ్మద్ గౌస్ మరియు మాస్టర్ ట్రైనర్స్ ఓబుళపతి, ఓబన్న మరియు టీచ్ టూల్ అబ్జర్వర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు దేవాలయం లాంటివి

విశాలాంధ్ర-గుత్తి : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎచ్.రామాంజనేయులు ఆధ్వర్యంలో గురువారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుత్తి మండల విద్యా అధికారి రవి నాయక్, ఎల్.ఎం.బాయ్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సి. ప్రేమావతమ్మ విచ్చేశారు. విద్యాధికారి రవి నాయక్ మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలని, ఇక్కడున్న దిన, వార, పక్ష, మాస పత్రికలకు, వివిధ రకాల పుస్తకాల చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. చిరిగిన చొక్కా నైనా వేసుకో కానీ ఒక మంచి పుస్తకమును కొనుక్కో అని కందుకూరి వీరేశలింగం అన్నారు అని విద్యార్థులకు తెలిపారు. లెక్చరర్ గోవిందరాజులు, ఉపాధ్యాయురాలుఎస్. సి.ప్రేమవాతమ్మ సామాజిక కార్యకర్త, గ్రంథాలయ పూర్వ పాఠకులు సలీమ్ ప్రసంగించారు. గ్రంథాలయ విద్యార్థులకు పోటీలు నిర్వహించి ముఖ్య అతిథి ద్వారా బహుమతులు ప్రదానం చేశారు. వారోత్సవాలలో చెట్నేపల్లి గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేష్ పాఠకులు సిద్దార్థ ఎల్.ఎంపాఠశాల పాల్గొన్నారు. చిరిగిగా గ్రంథాలయాధికారిచే 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు

కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో శ్రీ సత్యసాయి - భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి పుట్టపర్తిలో వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని విభాగాల సమన్వయంతో ఉత్సవాలను అద్వితీయంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. భగవాన్ శతజయంతి ప్రధాన కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర పౌర విమానాశ్రయ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి గడ్కరీ, రాష్ట్ర విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఆర్థిక శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర బీసీ చేనేత శాఖామంత్రి సవితమ్మ, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, కందుల దుర్గేష్, ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండుల్కర్, ప్రముఖ సినీ నటి ఐశ్వర్యరాయ్ బచ్చన్, అనగాని సత్యప్రసాద్, ఎన్‌హెచ్ఆర్‌సి అధ్యక్షులు రామ సుబ్రహ్మణ్యన్, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరైనట్లు తెలిపారు. ఇప్పటివరకు పుట్టపర్తి పుణ్య క్షేత్రానికి 424153 మంది భక్తులు విచ్చేశారని, జిల్లా వ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం పలు రైల్వే స్టేషన్ల నుండి పుట్టపర్తికి 261 ప్రత్యేక బస్సులను ఉచితంగా నడిపామని తెలిపారు. 4606 మంది యాత్రికులు ఉచిత షటిల్ బస్సు సర్వీసుల ద్వారా పుట్టపర్తికి చేరుకున్నారని వివరించారు. 230 మంది వివిఐపి లకు వాహనాలు ఏర్పాటు చేసి వాళ్ళను సందర్శించడానికి అన్ని రకాల సందర్శన చర్యలు పూర్తి చేశామన్నారు. వెస్ట్‌గేటు, ఎనుముల పల్లి, ప్రశాంతి నిలయంలో 1,92,151 మందికి బస ఏర్పాటు చేశామన్నారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో 25 దాకా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయగా 8011 మంది ఉచిత ఆరోగ్య సేవలను వినియోగించుకున్నా రని చెప్పారు. ప్రతిరోజు 95 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ద్వారా పారిశుద్ధ్య పనులను చేపట్టడం జరుగుతున్న దని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా 42 కేంద్రాలలో నీటి సరఫరా, పురుషులకు 150 టాయిలెట్లు అలాగే మహిళలకు 150 దాకా తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 40 దాకా సమస్యలను పరిష్కరించామన్నారు. శిల్పారామం వద్ద సెర్ప్ ద్వారా హస్తకళల శిబిరాలు, ప్రతిరోజు సాయంత్రం శిల్పారామం వద్ద వివిధ సాంస్కృత కార్యక్రమాలు, చిత్రావతి నదీలో తెప్పోత్సవం చిత్రావతి తీరాన లేజర్ షో ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికబోర్డులు లేక పెరుగుతున్న ప్రమాదాలు

సీపీఐ నేతల ఆవేదన

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల కేంద్రంలోని కాకతీయ డాబా సమీపంలో ఫోర్‌లైన్ రోడ్డుతో కదిరి బైపాస్ ముదిగుబ్బ టౌన్ నుంచి వచ్చే రహదారులు కలుస్తున్న రింగ్ రోడ్ ప్రాంతంలో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై సిపిఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, బీజేపీ మండల అధ్యక్షులు అంజన్ రెడ్డి కలిసి రింగ్ రోడ్ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, రింగ్ రోడ్ వద్ద ఐదు దిశలకు వెళ్లే రహదారులు ఉన్నప్పటికీ, వాహనదారులకు దారి సూచించే బోర్డులు లేకపోవడంతో తరచూ గందరగోళం నెలకొంటుందని తెలిపారు. ముఖ్యంగా బైపాస్ రోడ్ మరియు ముదిగుబ్బ టౌన్ నుంచి వచ్చే వాహనాలు ఫోర్‌లైన్‌లోకి ప్రవేశించే సమయంలో డ్రైవర్లు కన్ఫ్యూజ్ అవుతూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే రింగ్ రోడ్ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం కూడా ప్రమాదాలకు మరో కారణమని అన్నారు. నేషనల్ హైవే అధికారులు, పోలీసులు నిత్యం ఈ ప్రాంతం గుండా ప్రయాణిం చినప్పటికీ, ప్రమాదాలు తగ్గేలా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ఆక్షేపించారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే, భారీ రాస్తారోకో నిర్వహించి రోడ్డు దిగ్బంధనం చేపడతామని సిపిఐ నాయకులు హెచ్చరించారు. ఈ సమస్యను మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని బీజేపీ మండల అధ్యక్షులు అంజన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గంగిరెడ్డిపల్లి నాయుడు, సోంపల్లి భాస్కర్, ఆనంద్, నెట్టెం భాస్కర్, అక్కులప్ప పాల్గొన్నారు.

సత్యసాయి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం సంతోషకరం

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్రభుత్వం సత్యసాయి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే సింధూర రెడ్డి పేర్కొన్నారు. గురువారం శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయిబాబా నడియాడిన పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రాతినిత్యం వహిస్తుండడం సంతోషం ఉందన్నారు. విద్య వైద్యం తాగునీరు పేదలకు ఉచితంగా అందించి ఎంతోమంది నిర్భాగ్యులకు సత్య సాయి అండగా నిలిచిచారన్నారు. సత్యసాయి ఆశీస్సులు మా కుటుంబానికి ఎల్లవేళలా ఉన్నాయని మనస్ఫూర్తిగా నమ్ముతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు మంత్రుల కమిటీ ఏర్పాటు చేసి స్వయంగా పర్యవేక్షించడం ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పుట్టపర్తి రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా జోయాలుక్కాస్ సహకారంతో చిన్నపిల్లలకు పార్క్ ఏర్పాటు చేయడం సత్యసాయి ట్రస్ట్ సహకారంతో పుట్టపర్తిలో నైట్ విజన్ డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సాయి జయంతి శతాబ్ది ఉత్సవాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ,ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ,సినీనటి ఐశ్వర్యరాయ్ బచ్చన్ వంటి ఎంతోమంది ప్రముఖులు రావడం గర్వకారణం అన్నారు. పుట్టపర్తి మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

జాతీయ రహదారులను అనుసంధానం చేయండి

విశాలాంధ్ర-పుట్టపర్తి: జాతీయ రహదారులను అనుసంధానం చేయాలని శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి విచ్చేసిన కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని కలిసి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సింధూర రెడ్డి, ఎమ్మెస్ రాజులు కలిసి వినతిపత్రం అందజేశారు. హిందూపురం పార్లమెంటు పరిధిలో శరవేగంగా పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతొంది దని, ముదిగుబ్బ నుంచి పెనుకొండ పావగడ మీద నుంచి చెలికెరీ గ్రామం వరకు వెళ్లే ఇంటర్ స్టేట్ రహదారిని విస్తరించాలని, సోమందేపల్లి నుండి హిందూపురం, దొడ్బల్లాపురం మీదుగా యాలహంక వరకు వెళ్లే రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా విస్తరించాలని కోరారు.హైదరాబాద్ నుంచి బెంగళూరు ఎన్ హెచ్ 44 జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా విస్తరించాలని కోరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

శిల్పకళా సౌందర్యానికి లేపాక్షి ఆలయం అద్భుతం..

టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర-లేపాక్షి: అతిపెద్ద దేవాలయాలలో ప్రముఖ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దేవాలయం శిల్పకళా సౌందర్యానికి అద్భుతాలకు నిలువెత్తు రూపం వీరభద్ర ఆలయం అని రాష్ట్ర టూరిజం సినీ ఫోటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆనందం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆలయ సంప్రదాయాలతో ఆలయంలోకి ఆహ్వానించారు. దుర్గా వీరభద్ర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టతను శిల్పకళా నైపుణ్యం అప్పటి వీరన్న విరుపన్న చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లేపాక్షి ఆలయం దక్షిణ భారతదేశంలోని శిల్పకలకు ప్రత్యేక స్థానం సొంతం చేస్తుందన్నారు. ఆలయ అభివృద్ధికి టూరిజం నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. యునెస్కో గుర్తింపు కూడా రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపిందని శాశ్వత గుర్తింపు వచ్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. నంది ఉత్సవాలు ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పర్యాటక కేంద్రాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ సౌజన్య లక్ష్మి ఆలయ ఎగ్జిక్యూట్ ఆఫీసర్ నరసింహమూర్తి చరిత్రకారుడు మైనాస్వామి జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ ఆకుల ఉమేష్, పత్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆటో ద్విచక్ర వాహనం ఢీ.. పలువురికి గాయాలు

విశాలాంధ్ర-నల్లమాడ: మండలంలోని కొండకిందతండా సమీపంలో గురువారం సాయంత్రం ఆటో,ద్విచక్రవాహనం ఢీ కొని పలువురికి గాయాలు ఇద్దరి పరిస్థితి తీవ్రంగా నెలకుంది. సమీప బంధువులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చెరువు వాండ్ల పల్లి, గోపేపల్లికి చెందిన జీవనోపాధి కోసం 11 మంది కూలి పనులు కోసం వెళ్లి పనులు పూర్తీ చేసుకుని తిరిగి గ్రామాలకు వెళ్లేటప్పుడు కొండకిందతండాకు చెందిన శ్రీనివాసునాయక్ రెడ్డి పల్లి పాఠశాల నుంచి తమ కుమార్తెలను దివ్యా బాయి,గాయిత్రిబాయిలను తిరిగి కొండకిందతండాకు ద్విచక్రవానంలో వెళ్లుతుండుగా మలుపులో రెండు ఎదురు ఎదురు రాగా ఢీ కొనడం తో శ్రీనానాయక్ త లకు తీవ్రంగా గాయాలు పాలైనారు. గోపేపల్లి గ్రామానికి చెందిన పి.యశోధ, లక్ష్మిదేవి, నాగరత్నమ్మ, ఆదిలక్ష్మి, చెరువు వాండ్ల పిల్లికి చెందిన గంగులప్ప, సునిత, ఆటోడ్రైవర్ అశోక్ కు గాయాలు కావడంతో 108 వాహనంలో నల్లమాడ ప్రభుత్వాస్పత్రి తరలించి వైద్యపరీక్షలు నిర్వహిం చారు. అనంతరం తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు నాయక్, యశోధలను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

ఎన్టీఆర్ గృహ పథకం లబ్ధిదారులకు జియో ట్యాగింగ్

విశాలాంధ్ర - అగళి : మండల పరిధిలోని ఇరిగేపల్లి గొల్ల హట్టి,మధూడి గొల్ల హట్టి గ్రామాల్లో గురువారం స్థానిక నాయకులు మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారుల ఇంటి స్థలం గుర్తించడం కోసం సచివాలయం సిబ్బంది జియో ట్యాగ్ చేసారు.ఈసందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సౌజన్యంతో నియోజకవర్గంలోని పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని అన్నారు.ఇందులో భాగంగానే ఇళ్లు లేని నిరుపేదలకు త్వరలోనే ఇళ్లు మంజూరవుతాయన్నారు. ఇళ్ల జాబితాలో పేర్లు ఉన్న లబ్ధిదారులు ఈనెల 30లోపు ఇంటిస్థలాల కోసం జియో ట్యాగింగ్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు స్థానిక టిడిపి నాయకులు రెడ్డప్ప కార్యకర్తలు లబ్ధిదారులు వున్నారు

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల పౌర శాఖ ప్రధాన గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలోచివరి రోజు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్య అతిథులు ఎంఈఓలు రాజేశ్వరి దేవి గోపాల్ నాయక్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చింతపులుసు పెద్దన్న, వివిధ ప్రభుత్వ పాఠశాలల హెడ్మాస్టర్లు రాంప్రసాద్, పద్మజ, యువర్ ఫౌండేషన్ సభ్యులు బండ్లపల్లి రంగనాథ్ కవి సుకుమార్ రచయిత ఎల్ఐసి నాగరాజు ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారని తెలిపారు. వివిధ పోటీలలో మంచి ప్రతిభ కనపరిచి గెరిపొందిన విద్యార్థులకు కార్యదర్శి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం కమిటీ సభ్యులు, ఎంఈఓ లు లైబ్రరీ అధికారిని అంజలి సౌభాగ్యవతిని ఘనంగా సన్మానించారు టీచర్ సిహెచ్ మురళి, గ్రంథాలయ సిబ్బంది రాము సరస్వతమ్మ రమణా నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్ర స్థాయిలో ఈ నెల 21 తేదీ నుండి 23 తేదీ వరకు జరిగే 69 వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ అండర్ బి17 ఇంటర్ డిస్టిక్స్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం బాస్కెట్బాల్ బాల బాలికల జట్ల నందు బాలుర విభాగంలో ధర్మవరంకు చెందిన లక్ష్మీనారాయణ, కార్తిక్ , యేసు , ముగ్గురు బాలురు,బాలికల విభాగంలో శరణ్య, అండర్ 14 విభాగంలో ప్రియా దీప్తి ధర్మవరం పట్టణానికి చెందిన ఐదుగురు బాస్కెట్బాల్ క్రీడాకారులు ఎంపిక కావడం గర్వకారణమని ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రెటరీ శెట్టిపి జయ చంద్రారెడ్డి తెలిపారు. అక్టోబర్‌లో అనంతపురం ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్స్‌లో ప్రతిభ చూపి ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లకు ఎంపికయ్యారు అని తెలిపారు. ఉమ్మడి జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ సెక్రెటరీ శెట్టిపి జయ చంద్రారెడ్డి, ధర్మాంబా బాస్కెట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా, కోచ్ సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో రాణించి ధర్మవరానిక పేరుతేవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు గురువారం బయలుదేరి ఏలూరు జిల్లా నూజివీడికి వెళ్లారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వివేకానంద విద్యార్థి

విశాలాంధ్ర-లేపాక్షి : లేపాక్షి పరిధిలోని కంచి సముద్రం వివేకానంద జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మోహన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు ధనశ్రీ గురువారం తెలిపారు. అనంతపురం జూనియర్ కళాశాలలో జరిగిన అండర్ 14 పోటీ వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. ఉపాధ్యాయులు పీడీ మహేష్ దీపక్ అభినందించారు.

మెగా ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గాండ్లపెంట: మండల కేంద్రంలోని హై స్కూల్ సమీపంలో ఉన్న ఎస్.ఆర్. బిల్డింగ్‌లో గురువారం ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచులు షేక్ రహంతుల్లా, సీఎన్‌పి సుధాకర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందం సేవలందించింది. మొత్తం 140 మంది ఓపి రసీదులు పొందగా, 15 మంది ఆరోగ్య సమస్యల తీవ్రత కారణంగా తిరుపతిలో మెరుగైన వైద్య పరీక్షలకు పంపించారు. డాక్టర్ వెంకటరమణ, ఎల్లయ్య, నర్సులు పవిత్ర, మునియమ్మ, రాశి వైద్య సేవలు అందించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి

విశాలాంధ్ర-గుడిబండ : గుడిబండ మేజర్ పంచాయతీ కార్యదర్శిగా ప్రకాష్ విధులు నిర్వహిస్తున్న ప్రకాష్ క్రమంలో డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలను అందించినందుకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి లభించిందన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-పెనుకొండ: అనంతపురంలో నిర్వహించిన అండర్14 వాలీబాల్ పోటీలలో పెనుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న స్కంద, ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు, వచ్చే నెల 6,7,8 తేదీలలో నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని హెచ్ఎం రాఘవయ్య తెలిపారు.

మంత్రులకు ఘన స్వాగతం

విశాలాంధ్ర-చిలమత్తూరు: పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా గురువారం రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ లేపాక్షి ఆలయాన్ని సందర్శించడానికి విచ్చేసిన సందర్భంగా హిందుపురం జనసేన పార్టీ ఇంచార్జ్ ఆకుల ఉమేష్ ఆధ్వర్యంలో మంత్రిని మర్యాదపూర్వకంగా పూల మాలలు పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు,

గ్రంథాలయాలు విజ్ఞాన నిల్వలు

విశాలాంధ్ర-సోమందేపల్లి: గ్రంథాలయాలు విజ్ఞానం నిల్వ ఉన్న దేవాలయాలు అని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి మెహబూబ్ భాష పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మీబాయి ఉర్దూ టీచర్ సాఫీయా తస్లీమా భాను హాజరయ్యారు. వ్యాసరచన వకృత్వపు పోటీల విజేలతకు బహుమతులు అందించారు.

ఎస్‌జీఎఫ్ బేస్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలసముద్రంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు జిల్లా ఆర్డిటి స్టేడియంలో జరుగుచున్న ఎస్‌జిఎఫ్ బేస్‌బాల్ సెలక్షన్ల యందు అండర్-14 విభాగం లో రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక చేసినట్లు తెలిపారు, ఎనిమిదవ తరగతి లిఖిత, చైతన్య కుమార్ రెడ్డి 8వ తరగతి వీరిద్దరూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యా యులు రామాంజులుయాదవ్, ఫిజికల్ డైరెక్టర్లు బసెట్టి ప్రమద, బోయ గంగారాజులను కూడా అభినందించారు, వీరు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిస్తే వీరికి స్పోర్ట్స్ కోటాలో విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు మూడు శాతం వర్తిస్తాయని.. కాబట్టి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు.

పుర అభివృద్ధికి రూ.15 కోట్లు విడుదల

మున్సిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్‌కుమార్

విశాలాంధ్ర-హిందూపురం : ఎమ్మెల్యే లెజెండ్ నందమూరి బాలకృష్ణ కృషితో, రాష్ట్ర ప్రభుత్వానికి ఒత్తిడి చేసి పుర అభివృద్ధి కోసం మరో 15 కోట్ల రూపాయలు విడుదల చేపించారు. 15 కోట్ల రూపాయలకు నేడు పరిపాల అనుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డి.ఈ. రమేష్‌కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ, ప్రియతమా హిందూపురం ఎమ్మెల్యే గారు 92.5 కోట్ల రూపాయలకు చేశారు. వెంటనే మరల ఇప్పుడు 15 కోట్ల రూపాయలు హిందూపురం మున్సిపాలిటీ అభివృద్ధి పనులు చేయడానికి 15 కోట్ల రూపాయలు మంజూరు చేపించారు. అందులో భాగంగా గాంధీ సర్కిల్ నుండి బాలాజీ సర్కిల్ వరకు 40 అడుగుల రోడ్డు మరియు డివైడర్స్ మధ్యలో విద్యుత్ స్తంబాలు లైటింగ్, బాలాజీ సర్కిల్ నుండి ధర్మపురం బైపాస్ 40 అడుగుల రోడ్డు మరియు డివైడర్స్ మధ్యలో విద్యుత్ స్తంబాలు లైటింగ్, రైల్వే రోడ్డు లో డివైడర్స్, విద్యుత్ స్తంబాలు లైటింగ్ తోపాటు డి.ఎల్. రోడ్డు విస్తరణ కు ఈ నిధులను వినియోగిస్తామని తెలియజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగరాలని రిటైర్డ్ ఎంపీడీవో మహమ్మద్, గ్రంథాలయ అధికారి రమేష్ నాయక్, తెలిపారు. శాఖ గ్రంథాలయంలో గురువారం ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు పత్రికలు అందుబాటులో ఉంటాయని నిరుద్యోగులు విద్యార్థులు పాఠకులు ఉపయోగించుకోవాలన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన 35 మంది విద్యార్థులకు నోటి పుస్తకాలు కంబాక్స్ పెన్నులు వారికి అందజేశారు కార్యక్రమంలో నాగేంద్ర, దివ్య తేజ, ప్రసాద్, తిరుపాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ

విశాలాంధ్ర- ఓడిసి రూరల్: మండల పరిధిలోని తుమ్మల కుంట్లపల్లి గ్రామంలో రైతులకు సబ్సిడీ ఉలవలు మండల వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సర్పంచ్ శ్రీదేవి రైతులకు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా సర్పంచ్, వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ పంట మార్పిడితోపాటు అంతర పంటలు సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపాలని అన్నారు, కార్యక్రమంలో రైతులు, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ మూసల్ రెడ్డి, మండల మైనారిటీ కన్వీనర్ ఇర్ఫాన్, డీలర్ రఫీ , హరుణ్, చంద్ర నాయుడు పాల్గొన్నారు.

మండల కన్వీనర్ డీకే బాబు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-తలుపుల: మేజర్ పంచాయతీ, ఉబ్బరవాండ్లపల్లి నందు నివాసముండే ఎర్రసాని నాగిరెడ్డి అనారోగ్యంతో మరణించగా వైసీపీ తలుపుల మండల కన్వీనర్ డీకే బాబు టీం సభ్యులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డికె బాబు ఆదేశాల మేరకు రూ. 20 వేలు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎర్రమారెడ్డి, పెద్ద అక్కుల్ రెడ్డి, సదాశివరెడ్డి, వెంకట్, దివాకర్ రెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కొత్తపేట హైస్కూల్ ఎదురుగా టిడిపి పట్టణ నాయకుడు సందా రాఘవ పుట్టినరోజు సందర్భంగా గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిదని రక్త బంధం ఆర్గనైజేషన్ అధ్యక్షులు కన్నా వెంకటేష్ తెలిపారు. 50 మంది రక్తదానం చేశారని తెలిపారు. సందా రాఘవ వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల్లో పాల్గొని తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందిస్తూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందడం జరిగిందన్నారు. సందా రాఘవ మాట్లాడుతూ కన్నా వెంకటేష్ చేస్తున్న రక్తదాన శిబిరాలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాయని,ప్రత్యేకంగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రక్త బంధం ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల విజయకేతనం

విశాలాంధ్ర-కదిరి: యువజన ఉత్సవాలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల విజయకేతనం ఎగురవేసినట్లు ప్రిన్సిపాల్ రమా తెలిపారు. గురువారం ఎస్‌టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన యువజన ఉత్సవాలలో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్ట్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ భాగాలలో బహుమతులు సాధించక రావడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.భాస్కర్, సహేరాబాను, మహబూబ్ బాషా, గోవర్ధన్ నాయుడు, వెంకటసుబ్బయ్య , ప్రమోద్, నారాయణరెడ్డి, బాబారెడ్డి, సుమలత పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానాభివృద్ధి

విశాలాంధ్ర-తనకల్లు: పుస్తక పఠనంతోనే విద్యార్థులకు ప్రజలకు జ్ఞానాభివృద్ధి కలుగుతుందని గ్రంథాలయ అధికారి తెలిపారు మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో 58"వ జాతీయ గ్రాంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు ప్రదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీ యస్.ప్రభకర్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు అభివృద్ధి చెందాలంటే పుస్తక పఠనం ఎంతో అవసరం అన్నారు. ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు యస్.హరూర్ బాను, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ యస్.ప్రభకర్, గ్రంథాలయదికారి యస్.మస్తాన్ వలి ఎంపీపీ (ఉర్దు)స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు యస్.హరూర్ బాను, యం.పి.పి.(ఉర్దూ) ఉపాధ్యాయురాలు ఫీరోజా పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ హస్వ దృష్టి వారోత్సవాలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎస్బిఐ కాలనీ మధు కంటి వైద్యశాలలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు జాతీయ హస్వదృష్టి వారోత్సవాలను వారు ఘనంగా జరుపుకున్నారు. ముగింపు రోజు దాదాపు ప్రతిరోజు పదిమందికి పైగా కంటి వైద్య చికిత్సలను అందించి, ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దృష్టిలోపాలకు ముఖ్యమైన కారణం పుట్టుకతో వచ్చే కంటి పరిమాణం, జన్యువులు కారణము కావచ్చు అని తెలిపారు. టీవీలు, సెల్ ఫోన్లు ఎక్కువగా ఉపయోగించడం వలన దృష్టిలోపములు పెరుగుతున్నాయని తెలిపారు. దూరము, దగ్గర చూపు కనపడని యెడల వెంటనే కంటి డాక్టర్లను సంప్రదించాలని తెలిపారు. పాఠశాల లోని ఉపాధ్యాయులు కూడా తమ విద్యార్థులకు కంటిచూపు సమస్య ఉన్నచో వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.

మాలదారులకు అన్న వితరణ చేయడం దైవ సేవతో సమానం

విశాలాంధ్ర-ధర్మవరం: అయ్యప్ప మాలధారణ భక్తాదులకు అన్న వితరణ (బిక్ష) నిర్వహించడం దైవ సేవతో సమానమని గురుస్వామి విజయకుమార్ తెలిపారు. పట్టణంలోని పుట్టపర్తి రోడ్ షిరిడి సాయిబాబా ఆలయంలో అన్న వితరణ కార్యక్రమాన్ని గురుస్వామి విజయకుమార్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షులు డోలా రాజారెడ్డి గత రెండు సంవత్సరాలుగా ఈ సేవ చేయడం నిజంగా అభినందించదగ్గ విషయమని తెలిపారు. అనంతరం డోలా రాజారెడ్డిని ప్రత్యేకంగా ఆలయ కమిటీ సభ్యులతో పాటు గురుస్వామి అభినందనలు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 1ఒంటిగంట నుండి రెండు గంటల వరకు అన్న వితరణ ఉంటుందన్నారు. మొదటిరోజు అన్న వితరణకు 600 మందికి పైగా అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సూర్య ప్రకాష్, వీరనారాయణ, నారాయణరెడ్డి, రామలింగయ్య, నాయుడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోండి

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక గ్రంథాలయంలొ 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను చివరి రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ విద్యార్థులు అందరూ విరివిగా గ్రంథాలయాలను ఉపయోగించు కొని మంచి జ్ఞానాని సంపాదించుకోవాలన్నారు. వ్యాసరసన ఫోటీలలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి బి.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రవికృష్ణ పాల్గొన్నారు.

కాల్వ అక్రమాలపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 25 వ వార్డులో స్మశాన వాటిక ఇరిగేషన్ కాలువ అక్రమాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి నాయకులు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. టిడిపి నాయకులు చీమల రామాంజి, చీమల సూరి, క్లస్టర్ రామాంజి, అమర్ రవి మాట్లాడుతూ 25వ వార్డులో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అలివేలమ్మ, సర్వేయర్ సోము, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి సుధాకర్ పరిశీలించడం జరిగిందని తెలిపారు. దీంతో ఇరిగేషన్ కాలువ స్మశాన వాటిక ఆక్రమణకు గురైనట్టు గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ సంబంధిత అధికారులను ఆదేశించడంతో మున్సిపల్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 25వ వార్డు ప్రజలు టిడిపి నాయకులకు కృతజ్ఞతలను తెలియజేశారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 21, నవంబరు 2025

ప్రతి వ్యక్తి దైవ భక్తిని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రతి వ్యక్తి దైవభక్తిని పెంపొందించుకోవాలని శ్రీ సాయినాథ ట్రస్ట్ బృందం నిర్వాహకులు మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గణేష్ విగ్రహానికి శత వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కమిటీ బండి వేణుగోపాల్, శ్రీ సాయినాథ్ ట్రస్ట్ బృందం మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దైవభక్తిని పెంపొందించుకున్నప్పుడు మంచి నడిబడక, మంచి మార్గంతో పాటు మంచి చదువు లభిస్తుందని తెలిపారు. నేటి సమాజంలో యూత్ సంస్కృతి సాంప్రదాయాలను మరిచి, దురాలవాట్లకు అలవాటు పడడం బాధాకరమన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను దైవభక్తిని ఆచరింప చేస్తే చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి అలవాట్లతో, మంచి మార్గముతో ముందుకు వెళతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనిత వాణి అధ్యాపకులు వనిత, సునీత, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయవంతంగా సందా రాఘవ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని టీడీపీ ప్రముఖ నాయకుడు సందారాఘవ జన్మదిన వేడుకలు పట్టణంలోని కొత్తపేటలో గల ఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ముందు అత్యంత వైభవంగా టీడీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానుల మధ్య కోలా ఫలంగా ఘనంగా విజయవంతంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు టీడీపీ నాయకులు కార్యకర్తలు గజమాలతో సందా రాఘవాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 33 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం 50 మంది రక్తదానం కూడా ఇవ్వడం జరిగింది. దాదాపు 1000 మందికి పైగా అన్నదాన కార్యక్రమాన్ని పుట్టినరోజు సందర్భంగా నిర్వహించారు. టిడిపి నాయకులు నాగూర్ హుస్సేన్, సాయినాథ్, అశోక్, ఓం ప్రకాష్ ,బిబి, జీలకర శ్రీనివాసులు, జింకా పురుషోత్తం, బొట్టు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరైన వైద్యుల సలహాలు పాటిస్తే తప్పక సంతాన సాఫల్యం లభిస్తుంది

విశాలాంధ్ర-ధర్మవరం: సరైన వైద్యుల సలహాలు వైద్య చికిత్సలు పాటిస్తే తప్పక సంతానం లేని వారికి సంతాన సాఫల్యం లభిస్తుందని డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సాయిబాబా గుడి దగ్గర గల స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఉచిత సంతాన సాఫల్య అవగాహన శిబిరమునకు రావడం జరిగిందని వారు తెలిపారు. బెంగళూరు డాక్టర్ లావణ్య చే సంతానం లేని వారికి తగిన వైద్య చికిత్సలతో పాటు సంతానం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు వారు తెలియజేశారు. పిల్లలు పుట్టకపోవడం అనేది చికిత్స చేయదగిన మరొక వైద్య స్థితి అని వారు తెలిపారు. రిపోర్టులు మామూలుగా ఉన్నప్పటికీ గర్భం దాల్చలేక పోవడం వీర్యం కంటే తక్కువగా ఉండడం లేదా వీర్యం కంటే లేకపోవడం లాంటి సమస్యల పైన కూడా వారు దంపతులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ ఉచిత సంతాన సాపల్లె శిబిరం పట్ల దంపతులు కూడా స్పందన హాస్పిటల్ నిర్వాహ నిర్వాహక డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నూతన మండల కన్వీనర్‌కు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-యాడికి: టీడీపీ యాడికి మండల కన్వీనర్‌గా దడియాల ఆదినారాయణ ఎన్నికైన సందర్భంగా చౌడేశ్వరి కాలనీవాసులు నాయకులు , కార్యకర్తలు అభిమానులు గురువారం ఆయన ఇంటికి వెళ్లి కేక్ కట్ చేసి పూలహారాలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. వెంకట స్వామి, నాగమయ్య ,నాగరాజు, పురుషోత్తం, దేవరాజు, సింహాల, ఆంజనేయులు, వీరాంజనేయులు, హుస్సేన్ భాష ,చంద్రశేఖర్, శ్రీరాములు, కూన శివ, పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-బెలుగుప్ప: ఉరవకొండ గ్రంథాలయంలో గత వారం రోజులుగా జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కార్యదర్శి వేదమూర్తి ఇంచార్జి హెచ్‌ఎం మంజుల, గ్రంథాలయ అధికారి వై.ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. గత వారం రోజులుగా వివిధ అంశాలపై పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఎంతో తోడ్పడుతున్నాయని అందరూ గ్రంథాలయాల వినియోగించుకొని అభివృద్ధి పథంలో నడవాలని కోరారు. గ్రంథాలయాధికారి వై. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గత వారం రోజులుగా వారోత్సవాలలో పాల్గొని సహకరిం చిన జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు, ప్రజలు అధికారులకు పాత్రికేయులకు ప్రజా ప్రతినిధులకు, మీడియా వారికిఅందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

చదువు మనిషి అజ్ఞానాన్ని తొలగిస్తుంది

విశాలాంధ్ర-తాడిపత్రి: చదువు మనిషి అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శైలజ పేర్కొన్నారు. గురువారము పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రవి కుమార్ నాయుడు ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శైలజ, రిటైర్డ్ ఏ.జి ఎం.ప్రసాద్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కార్తీక్, ఉపాధ్యాయులు రామ్మోహన్, మహమ్మద్ రఫీ, మంజునాథ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చినిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అని, పుస్తకం ఒక మంచి నేస్తం అని పుస్తకాలను చదివే అలవాటు చిన్నప్పటినుంచే అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే పిల్లలకు బిస్కెట్స్ పంపిణీ చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సి ప్రకటించాలి

విశాలాంధ్ర - అనంతపురం రూరల్: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్‌సి ప్రకటించాలని రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం గార్లదిన్నె మండలం నందు లి"సమస్యల-సేకరణ"లి సభ్యత్వం నమోదు కార్యక్రమం చేపట్టారు. మర్తాడు, భూదేడు, కృష్ణాపురం, సంజీవపురము, ఎర్రగుంట్ల, పెనకచర్ల, డ్యాము, కొత్తపల్లి, కొప్పలకొండ తదితర పాఠశాలలో సభ్యత్వ నమోదు చేయడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ జీవో వెంటనే విడుదల చేయాలన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ మినహాయింపు పై ఇప్పటికే సుప్రీంకోర్టులో ఎస్ టీ యు రివ్యూ పిటిషన్ వేసామని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. ఈ విషయమై విద్యాశాఖ మంత్రి ముఖ్యమంత్రి చొరవ చూపాలని తెలియజేశారు. ఆర్థిక బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని, సర్వీస్ రూల్స్ పరిష్కరించి పదోన్నతులు ఇవ్వాలన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలు, పెండింగ్లో ఉన్న ఇతర బకాయిలు చెల్లించాలన్నారు. 12వ పిఆర్సి కమిషను నియమించి వెంటనే ఐ ఆర్ 30% ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లికార్జున గార్లదిన్నె ఎఫ్‌టియు నాయకులు వి.రామకృష్ణ, యస్.సాంబశివుడు, కె. షంషీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలు దర్శనం

విశాలాంధ్ర - నార్పల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించవలసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మధ్యాహ్నం 12.30 సమయంలో సిబ్బంది తో పాటు కంప్యూటర్ ఆపరేటర్స్ కూడా ఎవరు లేకపోవడం గమనార్హం. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు కార్యాలయం వద్ద కూర్చుని అధికారుల కోసం వేచి చూసి కార్యాలయానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోయారు. కానీ ఫీల్డ్‌లో వెళ్ళితే ఆఫీసు సిబ్బంది ఔట్సోర్సింగ్ సిబ్బంది అధికారులు మొత్తము వెళతారా అన్నది శోచనీయం) కార్యాలయంలో అధికారులు తమ విధులు నుండి తప్పించుకోవడానికి లేదా వారి వ్యక్తిగత కార్యకలాపాలకు వెళ్లడానికి కేటాయిస్తూ ఉన్నారని ప్రజలు భావిస్తున్నారు. జాబ్ కార్డ్స్ కోసం అనునిత్యం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యం గా ఉన్నారు. రోజుల తరబడి తిరుగుతున్న జాబ్ కార్డు అందించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్యాలయంలోనే అధికారులు లేకపోతే వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక వెనుతిరిగి వెళుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇలా ఉంటే సమయపాలన పాటించని సిబ్బందినిపైన అధికారులపై ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది.

వార్డులలో సమస్యలను పరిష్కరిద్దాం

విశాలాంధ్ర-గుంతకల్లు: వార్డుల్లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరిద్దామని టిడిపి గుంతకల్ మండల ఇంచార్జ గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానికపట్టణంలోని 1,2 అవార్డులలో ప్రధాన సమస్యలను గుంతకల్ మండల ఇంచార్జ్ గుమ్మనూరునారాయణస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలల సమయంలోనే శుభోదయం కార్యక్రమం నిర్వహించి పట్టణంలోని వార్డులు తిరుగుతూ ప్రజా సమస్యలను కనుక్కొని సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలు విద్యుత్ అంతరాయాలను పరిష్కరించానీ అన్నారు.గ్రామాల్లో కూడా పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించి సిసి రోడ్లు, గోకులం షెడ్లు, పాఠశాలల మరమ్మత్తులు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామునీ అన్నారు.అదేవిధంగా ఈరోజు ముఖ్యంగా ఒకటవ వార్డు రెండవ వార్డ్ లో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి, మున్సిపాలిటీ అధికారులతో కలిసి వాటి పరిష్కారం దిశగా అడుగులు వేస్తూ మున్సిపాలిటీలో ఉన్న నిధులను ప్రధాన సమస్యలపై ఉపయోగించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు సూచించడం జరిగిందినీ అన్నారు. అలాగే పట్టణంలోని 37వార్డులలో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి ఖచ్చితంగా అతి త్వరలో వాటిని పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు రెండో వార్డ్ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, మున్సిపల్ ఏఈ హరికృష్ణ, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించండి

విశాలాంధ్ర-తాడిపత్రి: కాలనీలలో ఉన్న ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించండని ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని నందలపాడు కాలనీలలో ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి పర్యటించారు. కాలనీలలో తిరుగుతూ వృద్ధులను, మహిళలను, యువకులను ఆప్యాయంగా పలకరిస్తూ కలియ తిరిగారు. ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి కాలనీలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ విజయ్ కుమార్, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు, టిడిపి కౌన్సిలర్లు, ఎక్సఫిసియో మెంబర్లు జెసి. అనుచరులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

తాళాల భజనలో మాకు మేమే సాటి

విశాలాంధ్ర - ఎల్లనూరు : ఉభయ రాష్ట్రాల తాళాల భజన పోటీలు గుంతకల్లు మండలం గుర్రప్పాడు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి కార్తీక అమావాస్య నెల పూజ సందర్భంగా నిర్వహించారు. ఈ పోటీలలో అనంతపురం జిల్లా, ఎల్లనూరు మండలంలోని కూచివారిపల్లి గ్రామానికి చెందిన సీతారామ భజన మండలి బృందం ప్రథమ బహుమతిగా రూ.20 వేలు దక్కించుకోవడం జరిగింది. అలాగే ద్వితీయ బహుమతి గుంతకల్లు మండలం అల్లం కొండ భజన బృందం రూ.18 వేలు, మూడవ బహుమతి వైఎస్ఆర్ కడప జిల్లా కాజీపేట బృందం రూ.16వేలు నాలుగో బహుమతి ప్రత్యేక బహుమతులుగా ప్రధానం చేయడం జరిగింది. కూచివారి పల్లి భజన బృందం గత వారం నార్పల మండలంలో జరిగిన పోటీలలో కూడా ప్రథమ బహుమతిని సాధించారు. ఉభయ రాష్ట్రాలలో ఎక్కడికి వెళ్లినా పోటీలలో ప్రథమ బహుమతితో తిరిగి రావడం, తమ గ్రామం పరువు ప్రతిష్టలు నిలిచేలా విజయాలు సాధిస్తుండడంతో గ్రామ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీతో ఉలవలు పంపిణీ

విశాలాంధ్ర - అగళి : మండలంలోని రైతులకు 80 శాతం రాయితీతో ఉలవలను జడ్పీటీసీ ఉమేష్, వ్యవసాయాధికారి నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో నాగరాజు మాట్లాడుతూ అగలి మండలానికి 250 క్వింటాళ్ళు ఉలవలు వచ్చినాయిని తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో ఉలవలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.10 కేజీల బస్తా పూర్తి ధర 560 రూపాయలు కాగా 80 శాతం రాయితీతో 448 రూపాయలు పోను రైతు వాటా 20 శాతంతో 112 రూపాయలు చెల్లించాలన్నారు. ఉలవలు పంట పప్పు ధాన్యాలకి సంబంధించింది కావడం తో విత్తడం ద్వారా నేలలో నత్రజని శాతం పెరుగుతుందన్నారు. అదేవిధంగా నేలల్లో ఉండే వివిధ రకాల పోషకాలు మొక్కకు లభించి నేల సారం పెరుగుతుందని తెలిపారు. అవసరమైన రైతులు మాత్రమే ఈ ఉలవలను తీసుకొని పంట వేసి ఈ రబీ సీజన్ లో కచ్చితంగా పంట నమోదు చేసుకోవాలని కోరారు. అవసరమైన రైతులు మాత్రమే తీసుకొని పంటలు వేసి నేలను సారవంతం చేసుకోవాలి అని అన్నారు, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్,మండల కన్వీనర్ తిప్పేస్వామి, ఏపీఎంసీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎంఆర్ శివరాములు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, సింగల్ విండో డైరెక్టర్ చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ మల్లికార్జున, రైతులు నాగప్ప, మల్లికార్జునప్ప, రంగనాథప్ప,రైతు సేవ కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోరబాగల్‌లో కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని మోరబాగల్ గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షుడు డిఎల్ యంజార్ గౌడ్ ఆధ్వర్యంలో ఓటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, ఇంటింటికి తిరిగి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో నేడుతూ సంపద సృష్టిస్తామని నమ్మబలుకుతూ ప్రభుత్వ ఆస్తులను సంపన్నులకు కట్టి పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక వైసీపీ నాయకులు మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, పంచాయతీ అధ్యక్షుడు హెగ్డే రామ క్రిష్టప్ప,యువ నాయకుడు యంజరప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణంలోని శాఖ గ్రంథాలయం నందు 58వ జాతీయ గ్రంథాలయ వారతోత్సవాల ముగింపు కార్యక్రమం గ్రంధా లయ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అన్నపూర్ణ ఆదినారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా ఒక గంట సేపు గ్రంథాలయాన్ని సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు రిటైర్డ్ ఎంఈఓ శ్రీరాములు మాట్లాడుతూ చినిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అని తెలియజేస్తూ పుస్తకం యొక్క విలువను ఆవశ్యకత గురించి తెలిపారు, రిటైర్డ్ ఎంఈఓ జయ చంద్ర రెడ్డి వారు మాట్లాడుతూ పుస్తకాలు మనకు నేస్తాల వంటివి పుస్తక పఠనం వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడానికి దోహదపడతాయని తెలిపారు, గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన చిత్రలేఖనం పాటలు పోటీల్లో గెలుపొందిన 27 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీదేవి, కార్యదర్శి శ్రీనివాస్ గుప్త, సంయుక్త కార్యదర్శి రమేష్ బాబు, కార్యవర్గ సభ్యులు నరహరి మూర్తి, వెంకటరమణ, బాబయ్య, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు సుకన్య, ఆదినారాయణ, ఫైరోజ్ అహ్మద్, విద్యార్థినీ. విద్యార్థులు. గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలో ధన రోడ్లో నివసిస్తున్న ఆదిలక్ష్మమ్మ ప్రమాదంలో ఆకస్మికంగా మరణించింది. ఐదు లక్షల ప్రమాద బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు మున్సిపల్ చైర్ పర్సన్ డిఈ రమేష్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ప్రెస్ వెంకటేష్ ఆదిలక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, ప్రమాదవశాత్తు మరణించిన విషయం వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కార్యాలయంలో తెలిపారు. ఆదిలక్ష్మమ్మకు టీడీపీ సభ్యత్వం కార్డు ఉండడంవల్ల ప్రమాద బీమా రూ.5లక్షలు చెక్కును గురువారం వారి కుటుంబ సభ్యులు ఆత్మ స్థైర్యంతో నిలబడేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు రవాణా అభివృద్ధి డైరెక్టర్ చంద్రమోహన్ యాదవ్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు రామాంజ నేయులు, టిడిపి నాయకులు మూర్తి, నాగేంద్ర వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలోని కనుమ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సమీపంలో గురువారం ఎస్సై మున్నీర్ అహ్మద్ వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులను తనిఖీ చేసి, హెల్మెట్ తప్పనిసరి, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదు, వాహనానికి ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అంటూ తెలిపారు, సరైన అనుమతులు లేని వాహనాలకు ఆన్లైన్లో అపరాద రుసుము చెల్లించుకోవాల్సిందేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతలయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రధానం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ శాఖా గ్రంథాలయం నందు గ్రంథాలయాధికారి మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి రాఘవయ్య, సుధాకర్, స్కూల్ హెచ్‌ఎం నబి, రిటైర్డ్ టీచర్ షమీవుల్లా, ఉపేంద్ర ఉపాధ్యాయులు గ్రంథాలయ పాఠకులు, విద్యార్థి నీ విద్యార్థులతో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రంథాల యాలు విజ్ఞానము నిల్వ ఉన్న దేవాలయమని విద్యార్థిని విద్యార్థులు చిన్న తనం నుండే గ్రంథాలయానికి వెళ్లి అక్కడ ఉండే విజ్ఞానాన్ని సముపార్జిం చుకుని ఉన్నతంగా ఎదగాలని వక్తలు కొనియాడారు. అనంతరం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో నిర్వహించిన వ్యాసరచన వకృత్వపు చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం పిల్లలకి మిఠాయి పంపిణీ జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మహబూబ్ బాషా గ్రంథాలయ పాఠకులు ప్రజలు పాల్గొన్నారు .

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటిసంతకాలు సేకరణ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు 11,12వ వార్డు 14,15వార్డుల్లో వైఎస్సార్సీపీ అధినేత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచనల మేరకు. గురువారం వైసీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ వైపీపీ నాయకులు ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా,ప్రజా మద్దతు కోరుతూ కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రూరల్ మండల పరిధిలోని మునిమడుగు గ్రామం నందు కన్వీనర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డుకౌన్సిలర్లు, గణప్ప,సద్దాం, కిరణ్, నాయకులు ఇర్షాద్, ఇస్మాయిల్, మురళీ, ఖాజా పీర్, సంజీవ, బోయ రాము, ప్రభాకర్ గుప్తా, లలిత్, గోవింద్, కొండలరాయుడు, అమర్, మూర్తి,వైసీపీ అనుబంధ విభాగాలు, అభిమానులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

బాధితుడికి ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-చిలమత్తూరు: చిలమత్తూరు మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులైన లక్ష్మి గత నెలలో బాగేపల్లిలో ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగి కాలుకు ఆపరేషన్ చేసి కింది భాగం తీసివేయడం జరిగింది, దీంతో విషయం తెలుసుకున్న లేపాక్షి ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ తరపున బాధితుడు స్వగ్రామమైన మరవ కొత్తపల్లికి వెళ్లి ఆయనను పరామర్శించి వారి కుటుంబానికి భరోసా కల్పిస్తూ రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఫోటో అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్, ఉపాధ్యక్షుడు సందీప్, సెక్రెటరీ నాగరాజు, రాజు, రామలింగ, రామచంద్ర, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట దక్కించుకున్న హీరేతుర్పి భోజేగౌడ్

విశాలాంధ్ర-గుడిబండ : గుడిబండ గ్రామపంచాయతీ పరిధిలో గల చింత చెట్ల పంటకు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్‌ల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. అత్యధికంగా 60 వేల రూపాయలకు వేలం పాట పాడి హీరేతుర్పి భోజేగౌడ్ దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన చింత చెట్ల పంట ద్వారా గ్రామపంచాయతీకి రూ.60 వేల ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీరామప్ప, వేలంపాట పాడెందుకు వచ్చిన రైతులు పాల్గొన్నారు.

కార్తీక అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-బెలుగుప్ప: ఉరవకొండ మండలం నెరమెట్ల గ్రామంలో గురువారం కార్తీక అమావాస్య సందర్భంగా శ్రీభోగలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, అకు పూజలు,స్వామి వారికి ప్రత్యేక పూలతో అలంకరణ నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామస్థుల అధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీభోగలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

కాలభైరవుని చెంత దీపోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీ స్వయంభు కాలభైరవ స్వామి ఆలయంలో కూష్మాండ దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీ చక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్నకాలభైరవస్వామి ఆలయంలో అమావాస్య పూజలు రెండు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించారు. ధర్మవరం నుంచే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమావాస్య గడియల్లో ఆలయంలో పూజారి ధనుంజయ్ ఆచారి దోష నివారణ పూజలు చేశారు. పూజల అనంతరం హిందూపురంకి చెందిన లోకనాథ్, లావణ్య దంపతులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూర్వపు పూజారి శ్రీరాములు ఆచారి శివైక్యం చెందిన రోజు కావడంతో కుంటిమద్ది వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - నార్పల : గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుంచి 20 నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ వారం రోజులు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గురువారం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్(బాలురు), జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలికలు), ప్రైమరీ స్కూల్ లో వ్యాసరచన, చిత్రలేఖనం,క్విజ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు, విద్యార్థినీయులకు బహుమతులు అందజేశారు. గెలుపు గెలుపొందిన విద్యార్థులకు, విద్యార్థినీయులకు బహుమతులు ముఖ్య అతిథులు ఎంఈఓ నారపరెడ్డి, టీచర్లు రవికుమార్, ఇందిర, సుధామణి చేతుల మీదుగా విద్యార్థినీయులు, విద్యార్థులు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు,నరసింహ రెడ్డి, గ్రంథాలయ పాఠకులు ఇంద్ర సేనారెడ్డి, కొనారెడ్డి, శ్రీనివాసులు,పాఠకులు,విద్యార్థులు,విద్యార్థినీయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

విశాలాంధ్ర-శింగనమల: ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగినది, వ్యాసరచన,చిత్రలేఖనం,రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్ గేమ్స్‌లలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు, గురువారం ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయుల చేతులమీదుగా బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి జి.కృష్ణను జిల్లా పరిషత్ హై స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు.

యాడికిలో ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఉన్న గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి మధుసూదన ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సచివాలయ సిబ్బంది సూర్యనారాయణ, ఉపాధ్యాయులు కొత్త రాయుడు, వనజ , ముని, మాధవి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలు అని, పుస్తక నిలయాలు అని, ప్రతి ఒక్కరూ వచ్చి గ్రంథాలయంలో పుస్తకములు చదువుకోవాలి అన్నారు. పుస్తకం చదవడం వల్ల ఎంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. కొత్త రాయుడు మాట్లాడుతూ చినిగిన చొక్కా నైనా వేసుకో కానీ ఒక మంచి పుస్తకమును కొనుక్కో అని అన్నారు. కాంపిటీషన్ లో పాల్గొన్న విద్యార్థులకు వ్యాస రూప పరీక్షలో గెలిచిన ప్రథమ బహుమతి ఎస్ మనహ, రెండో బహుమతి జువిక, మూడో బహుమతి సౌజన్య అలాగే డ్రాయింగ్ కాంపిటీషన్లో గెలుపొందిన ప్రథమ బహుమతి గౌస్, రెండవ బహుమతి హరిణి, మూడో బహుమతి భరణి పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.విద్యార్థిని విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థానాలకు అధిరోహించాలని బొమ్మనహాల్ ఎంఈఓ 2 మల్లికార్జున విద్యార్థులకు సూచించారు. బొమ్మనహాల్ శాఖ గ్రంథాలయ అధికారి బాబా ప్రసాద్ ఆధ్వర్యంలో ముగింపు సందర్భంగా గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, రన్నింగ్ రేస్, తదితర పోటీలలో ప్రతిభ చాటిన వారికి ఎంఈఓ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు సాయి లీల, లైబ్రరీ అధికారి బాబా ప్రసాద్ విద్యార్థిని, విద్యార్థులకు,ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. గ్రంథాలయ అధికారి బాబా ప్రసాద్, ముగింపు గ్రంథాలయ వారోత్సవానికి వచ్చిన అతిథులకు శాలువాలతో సత్కరించారు. ముగింపు గ్రంథాలయ వధోత్సవానికి పాఠకులు పాల్గొని విజయవంతం చేశారు.